

జీవించేందుకే మనిషి తినాలి

సమాజ సంక్షేమానికి జీవించాలి

- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జనస్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com



**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ : janaswaramnews@gmail.com

మొబైల్ నెంబర్ : 7013030690



సంపుటి : 4 | సంచిక : 291 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 05-05-2025 | పేజీలు : 5


# రైతాంగానికి ఆప్త మిత్రుడులా అండగా ఉంటోంది కూటమి ప్రభుత్వం

- రైతుల పేరుతో కుంభకోణాలు చేసింది వైసీపీ ప్రభుత్వం
- ధాన్యం కొనుగోలు చేసి రూ.1674 కోట్లు బకాయిపెట్టి వెళ్ళిపోయారు
- జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో 20 మంది కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడితే పట్టించుకోలేదు
- దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది జగన్ తీరు
- కూటమి పాలన మొదలైన 10 నెలల్లో 48.43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ
- ఇప్పటి వరకూ రూ.11 వేల కోట్లు జమ చేశాము
- ఈ వాస్తవాలను అంగీకరించలేని విచిత్ర పరిస్థితుల్లో జగన్ ఉన్నారు
- 24 శాతం తేమ ఉన్నా ధాన్యం కొనుగోళ్లు చేసేలా మిల్లర్ల కు కచ్చితమైన ఆదేశాలు ఇచ్చాం
- కాకినాడలో మీడియా సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



తెనాలి, మే 4 (జనస్వరం) : 'రైతాంగ సమస్యలపై కనీస అవహనలేని వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి. ఆయన హయాంలో అన్నదాతలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేలాది మంది కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అటువంటి వ్యక్తి రైతు సమస్యలపై మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంద'ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఆయన సొంత నియోజకవర్గం పులివెందులలో 20 మంది కౌలు రైతులు బలవన్మరణాలకు పాల్పడితే కనీసం నష్టపరిహారం అందించలేదన్నారు. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతులకు ఆదుకుంటామని చెప్పిన వ్యక్తి.. తన ఐదేళ్ల పాలనలో కనీసం రూ.50 కోట్లు కూడా ఖర్చు చేయలేదని గుర్తు చేశారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే జగన్ విమర్శలు చేస్తున్నారని, అలాంటి విమర్శలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. ఆదివారం సాయంత్రం కాకినాడలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "రైతుల పట్ల వైసీపీ అధినేత జగన్‌కు ఏనాడూ చిత్తశుద్ధి లేదు. ఆయన పాలనలో రైతులు అల్లాడిపోయారు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధాన్యం కొనుగోలులో రాండమైజేషన్ పద్ధతి తీసుకొచ్చి, సాఫ్ట్ వేర్ లో మోసం చేసి.. వైసీపీవాళ్ళకి నచ్చిన మిల్లర్లకే ధాన్యం అమ్మేలా చేశారు. అన్నదాతల నుంచి ధాన్యం కొలుగోలు చేసి, ఏనాడు సక్రమంగా వాళ్ల ఖాతాలో డబ్బులు జమ చేసింది పాపాన పోలేదు. కుంభకోణాల కోసమే రైతులను ఉపయోగించుకున్నారు తప్పితే ... వాళ్ళు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఏనాడూ ఆలోచించలేదు.

**ధాన్యం అమ్మి ఇంటికెళ్లేలోపు డబ్బులు జమ చేశాం :**

జగన్ సర్కార్ రైతులకు రూ.1674 కోట్లు బకాయిలు పెడితే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే వాటిని చెల్లించాం. వైసీపీ ప్రభుత్వం గత ఏడాది రైతుల నుంచి 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 10 నెలల్లోనే 48.43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. అంటే వైసీపీ కంటే 11 లక్షల మెట్నిక్ టన్నులు అదనంగా కొనుగోలు చేశాం. మరో 10 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. దాదాపు రూ.11 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం. రైతులు తమ ధాన్యాన్ని మిల్లులకు అప్పజెప్పి ఇంటికెళ్లేలోపు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నాం. రైతుల కష్టానికి తక్షణ ఆర్థిక మద్దతు అందించాం.

**మిల్లర్లు వారధిలా మారాలి :**

మిల్లర్లకు కూటమి ప్రభుత్వం అండగా నిలబడింది. వారికి బ్యాంకు గ్యారెంటీ ఇబ్బందులు తలెత్తకుండా, వారికి రావాల్సిన బకాయిలను విడుదల చేశాం. కొత్త ఆలోచనతో 1:2 నిష్పత్తిలో బ్యాంకు గ్యారెంటీ వెసులుబాటు కల్పించాం. ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా రైస్ మిల్లర్లు వ్యవహరించాలి. ప్రభుత్వానికి, రైతాంగానికి మధ్య వారధిలా మారాలి. అంతే తప్ప మబ్బులు పట్టాయని హడావుడి చేసి, ప్రభుత్వం ఇచ్చిన గోతాలు రైతులకు ఇవ్వకుండా ఇబ్బంది పెడితే మాత్రం చూస్తూ ఊరుకోం. కూటమి ప్రభుత్వం ఎప్పుడూ మిల్లర్లను అవమానించదు. కించపరిచే పనులు చేయదు. రైతులకు అండగా నిలబడితే మీతోపాటు కలిసి నడుస్తాం. ఎటువంటి సమస్య తలెత్తినా క్షేత్రస్థాయిలో పని చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అవసరమయితే ఉభయగోదావరి జిల్లాలో మరో 3 లక్షల మెట్రిక్ టన్నులు, కోనసీమలో 97,400 మెట్నిక్ టన్నులు, కాకినాడ జిల్లాలో 57,600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం.

**కచ్చితమైన ఆదేశాలిచ్చాం :**

గత రెండు, మూడు రోజులుగా అకాల వర్షాల పడడంతో ధాన్యం తడిసిపోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తడిసిన ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించాం. తక్షణమే రైతులకు గోతాలు అందించాలని యంత్రాంగాన్ని ఆదేశించాం. అలాగే తడిసిన ధాన్యం కొనుగోళ్లపై నిర్ణయం తీసుకుంటాం. 24 శాతం తేమ ఉన్నా ధాన్యం కొనుగోళ్లు చేసేలా మిల్లర్లకు కచ్చితమైన ఆదేశాలు ఇచ్చాం. తేమ శాతం పేరిట మోసం జరుగుతోందని రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారు. వచ్చే ఏడాది ఖరీఫ్ నుంచి తేమ శాతం పరీక్షించే యంత్రాలు ఒకే కంపెనీ నుంచి తీసుకుంటాం. రైతు సహాయక కేంద్రాల వద్ద ఏ కంపెనీ పరికరాలయితే పెడతామో... అవే పరికరాలు మిల్లర్లు దగ్గర ఉంచుతాం. దీంతో తేమ శాతం విషయంలో రైతులు ఎక్కడా మోసపోకుండా ఉంటారు" అన్నారు. ఈ సమావేశంలో కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, పార్టీ నాయకులు తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు.


# పోలవరంలో నేటి నుంచే నిపుణుల పర్యటన

- డయాఫ్రం వాల్ పనుల్లో నాణ్యత పరిశీలన
- ఈసీఆర్ఎఫ్ డ్యాంపై సమీక్ష
- 8 దాకా ప్రాజెక్టు వద్దే అమెరికా, కెనడా నిపుణులు
- వెంట జలసంఘం, పీపీఏ, వాపోక్స్, జలవనరుల శాఖ అధికారులు కూడా



**అమరావతి, మే 4 (జనస్వరం) :** పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం పనుల్లో అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణం.. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం పనులు త్వరితగతిన ముందుకు సాగడంపై అంతర్జాతీయ నిపుణులు దిశానిర్దేశం చేయనున్నారు. వీరు ప్రాజెక్టు ప్రాంతంలో సోమవారం నుంచి 8వ తేదీ దాకా మకాం వేసి వాల్ పనుల్లో నాణ్యత, ఈసీఆర్ఎఫ్ డ్యాం డిజైన్లు పరిశీలిస్తారు. సలహాలు, సూచనలు ఇస్తారు. అమెరికాకు చెందిన డేవిడ్ బి.పాల్, జియాన్ ఫ్రాంకో డి సిక్కో.. కెనడాకు చెందిన సీన్ హెంచ్‌బెర్గర్, రిచర్డ్ డొనెల్లీ ఆదివారం రాజమహేంద్రవరం చేరుకున్నారు. గురువారర వరకూ ప్రాజెక్టు వద్దే ఉంటారు. వారి వెంట కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్), వాపోక్స్, రాష్ట్ర జలవనరుల శాఖ, అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. సమీక్షల్లో పాలుపంచుకుంటారు. నిపుణులు సోమవారర ఉదయం వాల్ పనులు పరిశీలిస్తారు. ఎగువ కాఫర్ డ్యాంను పటిష్ఠపరిచే చర్యలు, గ్రౌండ్ ఇంప్రూవ్‌మెంట్ పనులను పరిశీలిస్తారు. మంగళవారం ఈసీఆర్ఎఫ్ డ్యాం నిర్మాణంలో అత్యంత కీలకమైన గ్యాప్-1లో చేపట్టాల్సిన నిర్మాణ విధివిధానాలు, ఆ ప్రాంతంలో నేల గట్టిదనాన్ని పరిశీలిస్తారు. తర్వాత ఈసీఆర్ఎఫ్ డిజైన్లపై జల సంఘం, సీఎస్ఎంఆర్ఎస్, వాపోక్స్‌లతో సమీక్షించి.. తమ అభిప్రాయాలు, ఆలోచనలు పంచుకుంటారు. మధ్యాహ్నం గ్యాప్-1లో చేపడుతున్న పనులపై చేపట్టిన నమూనా పరీక్షల ఫలితాలపై అభిప్రాయం చెబుతారు. ఈసీఆర్ఎఫ్ డ్యాం నిర్మాణం కోసం సమీకరించిన మెటీరియల్‌ను పరిశీలిస్తారు. బుధవారరనాడు గ్యాప్-2లో చేపట్టాల్సిన పనులను సమీక్షించి, తగు సూచనలూ ఇస్తారు. పర్యటనలో చివరి రోజైన గురువారం కేంద్ర జల సంఘం రూపొందించిన 'ప్రిమావేరా' యాప్‌కు అనుగుణంగా పోలవరం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు క్రమపద్ధతిలో పనులు చేపడుతున్నారో లేదో నిపుణులు పరిశీలిస్తారు. కుంగిపోయిన గైడ్‌బండ్ లోపాల సవరణకు శాశ్వత పరిష్కార మార్గాలను సూచిస్తారు. అప్రోచ్ చానల్‌పైనా తమ అభిప్రాయం చెబుతారు. డయాఫ్రం వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యాం పనుల కోసం చేపట్టిన కార్యాచరణ గురించి వారికి ఈఎన్సీ ఎం.వెంకటేశ్వరరావు, పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి వివరిస్తారు. అమెరికా, కెనడా నిపుణులు ఇచ్చే సూచనలు 2027 డిసెంబరు నాటికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేందుకు దోహదపడతాయన్న విశ్వాసాన్ని జలవనరుల శాఖ అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

తేదీ : 04 మే 2025,

తిథి : శుద్ధ సప్తమి (ఉ.07:22వ.కు),

నక్షత్రం : పుష్యమి (మ.12:55వ.కు)

బ్రహ్మ ముహూర్తం : తె.04:09ల తె.04:57

రాహుకాలం : సా.04:49ల సా.06:25,

యమగండం : మ.12:04ల మ.01:40,

వర్జ్యకాలం : 05తా తె.02:13ల తె.04:05

## ఈ రోజు నమాజ్ వేళలు

తేదీ : 04 మే 2025,

ఫజర్ : తెల్లవారుజామున గం. 04:40

సూర్యోదయం : ఉదయం గం. 05:55

జొహర్ : మధ్యాహ్నం గం. 12:17

అసర్ : సాయంత్రం గం. 03:27

మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:38

ఇష : రాత్రి గం. 07:53





జనస్వరం

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు

రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..

అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్

ఫోన్ నెం : 7013030690

మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# అమరావతిపై వైసీపీ సరికొత్త అస్త్రాలు!

## ఎడిటోరియల్


రాజధాని విషయంలో వైసీపీ విఫలమైంది. దాని పర్యవసానాలను 2024 ఎన్నికల్లో అనుభవించింది. అయినా సరే అమరావతి రాజధాని విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని వైసీపీ సంకేతాలు పంపుతోంది. మరో కొత్త ప్రచారానికి తెరలేపింది. అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా హాజరై అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. అత్యంత వేడుకగా ఈ కార్యక్రమం కొనసాగింది. జాతీయస్థాయిలో సైతం గుర్తింపు సాధించింది. కూటమి ప్రభుత్వానికి ఎనలేని ఖ్యాతిని తెచ్చింది. ప్రధాని నరేంద్ర మోడీ సైతం తమ వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. మూడేళ్లలో ప్రజా రాజధానిని చంద్రబాబు నిర్మించి తీరుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ప్రజలు కూడా అమరావతి రాజధాని నిర్మాణం శరవేగంగా జరుగుతుందని ఆశిస్తున్నారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే వైసీపీ సరికొత్త ప్రచారానికి దిగుతోంది.

**ప్రత్యేక ఆహ్వానం ఇచ్చినా :**

అమరావతి రాజధాని పునర్నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వైసీపీ అధినేత జగన్ రెడ్డికి ప్రత్యేక ఆహ్వానం పంపింది ప్రభుత్వం. కానీ కార్యక్రమానికి ఆయన గైర్హాజరయ్యారు. ఆపై గతం మాదిరిగా అమరావతి టెండర్ల పైన విమర్శలు చేస్తున్నారు. ఇప్పుడు వైసీపీ శ్రేణులు, ఆ పార్టీ సోషల్ మీడియా సైతం ఇదే అంశాన్ని తెరపైకి తెచ్చింది. ప్రభుత్వం భారీగా అప్పులు చేసి అమరావతికి ఆ మొత్తాన్ని పరిమితం చేస్తోందని ఆరోపిస్తోంది. ఆంధ్ర అంటే ఒక్క అమరావతి మాత్రమే కాదని.. ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమ ప్రాంతాలు ఉన్నాయని గుర్తుచేస్తోంది. పాలనా వికేంద్రీకరణ అన్నది లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. గత రెండు రోజులుగా వైసీపీ సోషల్ మీడియా దీనిపైనే పెద్ద ఎత్తున ట్రోల్ చేస్తోంది.

**మాజీ మంత్రి విమర్శలు.. :**

మరోవైపు వైసీపీ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మీడియాతో మాట్లాడారు. అప్పులు చేసి అమరావతికి పెట్టడం దారుణమన్నారు. ఇది కచ్చితంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని పణంగా పెట్టడమేనని పేర్కొన్నారు. రాజధాని ప్రాంతమైన అమరావతికి కృష్ణానది ముంపు ప్రమాదం ఉందని చెప్పారు. నిజంగా ఆ భయం లేకపోతే దాదాపు రూ.1100 కోట్లతో ఐదు ఎత్తిపోతల పథకాలు ఎందుకు నిర్మిస్తారని ప్రశ్నించారు. వాటిని నిర్మించకపోతే అమరావతికి రుణాలు ఇవ్వలేమని బ్యాంకులు హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. దేశంలో జాతీయ రహదారులకు కిలోమీటర్‌కు 20 కోట్లు ఖర్చు పెడుతుంటే.. అమరావతిలో రూ.59 కోట్లు ఎందుకు ఖర్చు పెడుతున్నారని సాకే శైలజానాథ్ ప్రశ్నించారు. తద్వారా కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు.



**మూడు రాజధానులు వర్కౌట్ కాలే.. :**

వైసీపీ మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. అది వర్కౌట్ కాలేదు. అమరావతిని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించకూడదని భావించింది. కానీ 2024 ఎన్నికల్లో అధికారం కోల్పోవడంతో సీన్ మారింది. మళ్లీ అమరావతికి కొత్త కళ ప్రారంభం అయింది. అంగరంగ వైభవంగా అమరావతి పునర్నిర్మాణ ప్రారంభోత్సవం చేసుకుంది. అయితే ఆ క్రెడిట్ కూటమి ప్రభుత్వానికి దక్కకూడదని ఇప్పుడు కొత్త ఆలోచనలతో ముందుకెళ్తోంది వైసీపీ. ప్రజలకు వాస్తవాలు వివరించే ప్రయత్నం చేస్తోంది. మరి అవి ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

జమ్ము సాయి కల్యాణ్,
పొలిటికల్ అనలిస్టు,
మేనేజింగ్ డైరెక్టర్,
జనస్వరం మీడియా.



## డాక్టర్ మునిబాబుకు ఘన సత్కారం



**పులివెందుల, మే 4 (జనస్వరం) :** పట్టణంలోని జెండా మాను వీధిలోని డాక్టర్ మొమ్మెల మునిబాబును ఆదివారం ఆయన నివాసంలో ఘనంగా సత్కరించారు. వీడియో ట్రాన్స్మిషన్ స్కీమ్స్ టు ఇంప్రూవ్ క్వాలిటీ ఆఫ్ సర్వీసెస్ ఇన్ వైర్ లెస్ నెట్ వర్క్ నందు డాక్టరేట్ సాధించిన సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సేవాసమితి అధ్యక్షులు రాజు శ్రీ రాజా కళా నిలయం డాన్స్ మాస్టర్ రాజాల చేతులమీదుగా పుష్పగుచ్ఛం ఇచ్చి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మునిబాబు వీడియో ట్రాన్స్మిషన్ స్కీమ్స్ టు ఇంప్రూవ్ క్వాలిటీ ఆఫ్ సర్వీసెస్ ఇన్ వైర్ లెస్ నెట్ వర్క్‌లో పరిశోధన జరిపి డాక్టరేట్ సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మునిబాబు మరెన్నో పరిశోధన ఆవిష్కరణలలో విజయం సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవా సమితి లింగాల మండల కో ఆర్డినేటర్ మస్తాన్ భాషా, పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్, సభ్యులు బండారు రాజు, రవి కుమార్, నాగేంద్ర, మాల్యాద్రి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయానిధితో పేదల ప్రాణాలు కాపాడుతున్నాం

### ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి



**పులివెందుల, మే 4 (జనస్వరం) :** సీఎం సహాయానిధి ద్వారా ఎంతో మంది పేదల ప్రాణాలను కాపాడుతున్నామని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి అన్నారు. పట్టణంలో ఆయన స్వగృహంలో సీఎం ఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేముల మండలం, చింతల జూటూరు గ్రామానికి చెందిన ఎద్దుల గంగాదేవికి రూ. 1,20,495లు, నల్లచెరువు పల్లి గ్రామానికి చెందిన వడ్డెరపు గంగాదేవికి రూ.40,350లు, సింహాద్రిపురం మండలం, గురజాల గ్రామానికి చెందిన భూమిరెడ్డి అమృతవాణికి రూ.31,365లు, వేంపల్లి మండలం కత్తులూరు గ్రామానికి చెందిన కలమల అంజనమ్మకు రూ.1,30,000లు, తొండూరు మండలం, మడూరు గ్రామానికి చెందిన గుజ్జల నాగ మునిరెడ్డికి రూ.67,497ల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్దిదారులు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డిలకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆదర్శ కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ పొన్నతోట



**పులివెందుల, మే 4 (జనస్వరం) :** ఎందరో అతిరథ మహారథులను జాతికందించిన కడప జిల్లా సింహాద్రిపురం మండలంలో అంకాలమ్మ గూడూరు గ్రామంలో జన్మించిన నిస్వార్థ ప్రజా సేవకుడు తెల్లదొరల కాలములోనే ఉపాధ్యాయ, చేనేత కార్మిక, రైతు,రైతు కూలీ, మహిళా, బండ్ల కార్మిక తదితర సంఘాలను నిర్మించి, నాటి రైతాంగ సమస్యల పరిష్కారం కొరకు కృష్ణా, తుంగభద్రా జలాల కొరకు మొదట కరపత్రం వేయడమే గాక ప్రజాలాంధోనలను నిర్వహించాడు. ఐక్య కార్య చరణ ప్రధాన కార్యదర్శిగా ప్రాజెక్టుల మహాసభలను సింహాద్రిపురం, పులివెందుల మొదలైన చోట్లు ఏర్పాటు చేసి ప్రజలను కార్యోన్ముఖులను చేశారని, జీవితాంతం అలుపెరుగని పోరాటం చేసిన ఆదర్శ కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ పొన్నతోట వెంకటరెడ్డి అని మాజీ జెడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి శ్లాఘించారు. పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరులో ఆదివారం కామ్రేడ్ పొన్నతోట వెంకటరెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం 10వ తరగతిలో మొదటి మార్కులు సాధించిన అంకాలమ్మ గూడూరు హైస్కూల్ విద్యార్థులు గంగా మహేశ్వరికి వేయి రూపాయలు, రెండవ స్థానంలో నిలిచిన చరణ్‌కు ఐదు వందలు జాతీయ ఉత్తమ అవార్డు గ్రహీత పొన్న తోట గంగాధర్ రెడ్డి ప్రోత్సాహక బహుమానంగా అందజేశారు. కార్యక్రమంలో అంకాలమ్మ గుడి దేవస్థానం చైర్మన్ సోమకొండారెడ్డి, నక్కలపల్లి కొండా రెడ్డి,రమణ, పోస్టు శివుడు, కందుకూరు సోమిరెడ్డి, కేవీ రవి, అశోక్, రామ్మోహన్, పొన్నతోట గంగాధర్, ప్రసాద్, అజయ్, సరళ, రఘు, జె.వి.వి జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న పెద్ద ఎత్తున దళితులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## షర్మిలమ్మా.. పలుకే బంగారమాయగదమ్మా...

- పరిహారంపై పోటాపోటీ హామీలు
- హెక్టారుకు రూ.30వేలు : టీడీపీ
- హెక్టారుకు రూ. 20వేలు : వైసీపీ
- మాట వరుసకైనా పలుకరించని కాంగ్రెస్



**పులివెందుల మే 4 (జనస్వరం) :** నేను రాజన్న బిడ్డను.. పులి కడుపున పులే పుడుతుంది.. నేను ఎవ్వరికీ భయపడను.. రాజన్న ఆశయాలను నెరవేర్చడమే లక్ష్యం అంటూ 2024 ఎన్నికల సందర్భంగా పిసిసి చీఫ్ వై ఎస్ షర్మిలరెడ్డి బహిరంగ సభల్లో చేసిన వ్యాఖ్యలివి. అరటి రైతులకు పరిహారం అందించే విషయంలో అటు అధికార ఇటు ప్రతిపక్ష పార్టీలు పోటా పోటీగా హామీలు ఇచ్చాయి. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం దెబ్బతిన్న పంటల వైపు కన్నెత్తి కూడా చూడలేదు. పంట నష్టం జరిగి నెలన్నర కావస్తున్నా ఇంత వరకు పలకరింపు లేదు పరామర్శ లేదు. అధికార పార్టీ తరపున హెక్టారుకు రూ.30వేలు చొప్పున పరిహారం చెల్లిస్తామని ఆ పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. అలాగే హెక్టారుకు రూ.20 వేలు చొప్పున వైసీపీ తరపున పరిహారం అందజేస్తామని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి రెండు రోజుల క్రితం ప్రకటించారు. సాధారణంగా వేసవిలో ఈదురు గాలులు సంభవించడం సహజమే. ఈ పరిణామ క్రమంలో ఈ ఏడాది మార్చి 22న ఈదురు గాలులు విరుచుకు పడడంతో లింగాల మండలంలో అరటి పంటలు దెబ్బ తిన్నాయి. అలాగే రెండో విడత గత నెలలో వీచిన గాలులకు మరిన్ని అరటి తోటలు ధ్వంసమయ్యాయి. లింగాల మండలంలోని అతి పెద్ద భారీ నష్టం జరిగినట్లు ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేశారు. పంట నష్టం జరిగిన సమయంలో టీడీపీ తరపున ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, అలాగే అసెంబ్లీ ఇంచార్జ్ బీటెక్ రవిలు దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించారు. అదే సమయంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కూడా ధ్వంసమైన అరటి తోటలను పరిశీలించి దెబ్బతిన్న రైతులను పూర్తి స్థాయిలో ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తానని రైతులకు భరోసా కల్పించారు. ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో ఫోను ద్వారా రైతులతో మాట్లాడించారు. హెక్టారుకు రూ.30వేలు చొప్పున పరిహారం అందజేస్తామని మరిన్ని ప్రత్యామ్నాయ వసతులు కృషి చేస్తామని అప్పట్లో రామ గోపాల్ రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. మార్చి 24వ తేదీన వైసిపి అధినేత వైయస్ జగన్ కూడా దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించారు. ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న ప్రతి రైతును ఆదుకునేందుకు తమ వంతు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తానని జగన్ రైతులకు హామీ ఇచ్చారు. ఇక అసలు విషయానికి వస్తే వైయస్ కుటుంబ సభ్యులు రాజకీయ అరంగేట్రం చేసినప్పటి నుండి లింగాల మండల ప్రజలు అండగా ఉంటూ వస్తున్నారు. ఒక విధంగా వైయస్ కుటుంబ సభ్యులకు లింగాల మండలం కుడి భుజం అని కూడా కొంతమంది చెబుతున్నారు. రాజన్న బిడ్డగా ఆయన తనయ షర్మిలా రెడ్డి పిసిసి అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. తాను రాజన్న బిడ్డనని, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి తరహాలోనే ప్రజలకు అందుబాటులో ఉంటానని 2024 ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విషయాన్ని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. రెండు పర్యాయాలు విపత్తు జరిగి వందలాది ఎకరాలలో అరటి తోటలు దెబ్బతిన్నప్పటికీ కనీసం ఇటు వైపు షర్మిలారెడ్డి కన్నెత్తి చూడకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం అరటి రైతులకు పరిహారం అందించే విషయంలో అటు టీడీపీ ఇటు వైసీపీ ఫోటాపోటీల హామీల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తెరపైకి వచ్చింది. మరి వైఎస్ షర్మిలారెడ్డి రైతులకు పరిహారం అందించే విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

## ఘనంగా కోకోనట్ వార్షికోత్సవ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

### ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి రామానాయుడు



**పాలకొల్లు, మే 4 (జనస్వరం) :** కొబ్బరి పంట అనేది కేవలం వ్యాపారపరంగా మాత్రమే కాకుండా పూజా కార్యక్రమాలలో, వివాహాది శుభకార్యములలో, దేవాలయాల్లో వినియోగిస్తారని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ది పాలకొల్లు కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన 53వ వార్షికోత్సవ వేడుకలకు, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా మంత్రి రామానాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల్లో వరి సాగు తరువాత కొబ్బరి సాగు అధికంగా ఉంటుందని, ఇంటి సభ్యులతో పాటు కొబ్బరి మొక్కను కూడా పెంచాలనే వారని మంత్రి గుర్తు చేశారు. మన దేశంతో పాటు విదేశాల్లో కూడా కోకోనట్ ఆయిల్, పౌడర్, కోకోనట్ వాటర్ తదితర వాటితో ఆదాయ వనరుగా ఉండటంతో పాటు, ఇతర ఉత్పత్తిలతో చిన్న కారు పరిశ్రమలు ద్వారా రైతాంగం అభివృద్ధి చెందుతుందన్నారు. తన తండ్రి ధర్మారావుకు తోడుగా తాను కూడా వరి సాగు, కొబ్బరిసాగులో సాయం చేసే వాడినని, నాగేంద్ర తండ్రి దుర్గారావుతో ఒక కస్టమర్‌గా వ్యాపార లావాదేవీలు కొనసాగించేవాడినని మంత్రి రామానాయుడు గత అనుభవాలను వివరించారు. కార్యక్రమానికి ముందుగా నూతన కార్యవర్గం చేత మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘ అధ్యక్షునిగా వరుసగా రెండోసారి కటారి నాగేంద్ర కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. అదేవిధంగా గౌరవ అధ్యక్షులుగా మాటూరి వీర వెంకట నరసింహమూర్తి, ఉపాధ్యక్షులుగా చివటపు నాగేశ్వరరావు, కుందురు వెంకట్రామయ్య, లంకలపల్లి సత్య రమేష్, కార్యదర్శిగా మాటూరి రామకుమార్, కోశాధికారిగా దేవరపు శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా కొండేటి శ్రీనివాస్, అదనపు కోశాధికారిగా గుండుమోగుల నాగేశ్వరరావు తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం మంత్రి రామానాయుడుతో పాటు నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు కారుమూరి నరసింహ రావు, ఉపాధ్యక్షులు దేవరపు లక్ష్మినారాయణ, గవర సూర్యనారాయణ, కొల్లి నరసింహమూర్తి, కొండేటి సూర్యనారాయణ, సంఘ ప్రతినిధులు సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా భగీరధుడి జయంతి




**పులివెందుల, మే 4 (జనస్వరం) :** పట్టణంలో శ్రీ భగీరథ సగర సంఘం (ఉప్పర) ఆధ్వర్యంలో ఆదివారం భగీరధుడి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి (పాత మార్కెట్) ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భగీరధుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భగీరథడి జీవిత సంగ్రహ చరిత్ర వివరించారు. ప్రతి ఒక్కరూ భగీరధుడి ఆశయాలకు పునరంకితం కావాలని సగర సంగం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం ప్రెసిడెంట్ ధర్మవరపు ఓబులేసు, వర్కింగ్ ప్రెసిడెంట్ పప్పూరు ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి పూజన బోయిన నాగేశ్వరరావు, కోశాధికారి బ్రహ్మయ్య, జాయింట్ సెక్రటరీ నాగేంద్ర బోస్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**పులివెందుల, మే 4 (జనస్వరం) :** నియోజకవర్గంలోని తొండూరు ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కృష్ణారెడ్డి అధ్యక్షతన విద్యార్థులు ఆనందంగా జరుపుకున్నారు. కలిమిలోనైనా లేమిలోనైనా కలకాలం కలిసుందామని ఒకరికొకరు చెప్పుకునే రోజు ఈ రోజు ఇదే.. ఇదే.. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనమని వారు పేర్కొన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకుని సంబరపడ్డారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి రోజులను గుర్తుకు తెచ్చుకుంటూ నవ్వుల సంద్రంలో మునిగి తేలారు. పెద్దలంతా పిల్లలుగా మారి సందడి చేయడం గురువులను కూడా సంతోషపడ్డారు. చివరగా నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించుకున్నారు. ఈ కార్యక్రమంలో 60 మందికి పైగా విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, నాటి గురువులు నాగిరెడ్డి, రామచంద్రా రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రమణారెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాసులు, ప్రదీప్, మధు, లక్ష్మీనారాయణరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలు... మా ధాన్యం వెంటనే కొనుగోలు చేయండి మహాప్రభో

- మల్కాపురం రైతు సేవా కేంద్రం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల ధర్నా
- రైతు పండించిన ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేయాలి
- అకాల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్



**ఏలూరు రూరల్ (మల్కాపురం), మే 4 (జనస్వరం) :** "అకాల వర్షాలతో ఇబ్బందులు పడుతున్నాం.. మా ధాన్యం వెంటనే కొనుగోలు చేయండి మహా ప్రభో" అంటూ ఏలూరు రూరల్ మండలం మల్కాపురం రైతు సేవా కేంద్రం వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు,కౌలు రైతులు ఆదివారం "ధర్నా" నిర్వహించారు. మా ధాన్యం ప్రభుత్వం కొనాలంటూ నినాదాలు చేశారు. ముందుగా రైతు సంఘం నాయకులు బరకాలు కప్పి ఉన్న ధాన్యం బస్తాలను, ధాన్యాన్ని పరిశీలించారు. అకాల వర్షంతో బరకాలపై పడి ఉన్న నీళ్లను తోడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక్క మల్కాపురం రైతు సేవా కేంద్రం పరిధిలో 1500 మెట్రిక్ టన్నుల ధాన్యం వరకు కల్లాల్లో ఉండిపోయిందన్నారు. కొనుగోలు లక్ష్యం పూర్తయిందని ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయడంతో రైతులు, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షం కురవడంతో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని రక్షించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారని చెప్పారు. బరకాల అద్దెలు,కూలీ ఖర్చులు పెరిగి రైతులు,కౌలు రైతులపై పెట్టుబడి ఖర్చుల భారం పెరిగిపోతుందన్నారు. ధాన్యం కొనుగోలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన అన్నదాతలు నష్టపోవాల్సి వస్తోందన్నారు. రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తాం.. అంటూ హామీలు ఇచ్చి మా టార్గెట్స్ పూర్తయ్యాయి.. ధాన్యం కొనలేం.. అంటూ ప్రభుత్వం చేతులెత్తేయడం దారుణమని విమర్శించారు. ధాన్యం కొనుగోలు టార్గెట్ పేరుతో అన్నదాతలు టార్గెట్ చేయడం తగదన్నారు. ధాన్యం కొనుగోలు లక్ష్యం వెంటనే పెంచి రైతులు, కౌలు రైతులు వద్ద ఉన్న పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు నిబంధనలు సడలించాలని కోరారు. అనంతరం రైతు సేవా కేంద్రం అసిస్టెంట్ తో ధాన్యం కొనుగోలు సమస్యలపై మాట్లాడగా మల్కాపురం రైతు సేవా కేంద్రం పరిధిలో 700 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు టార్గెట్ ఇచ్చినట్టు తెలిపారు. దీంతో అన్నదాతలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఆడాడ శ్రీనివాసరావు, లంకా వెంకటరమణ, గొర్రెల రొయ్యా రావు, గుర్రాల శోభన్ బాబు, కండిబోయిన రమేష్,బత్తుల యేసు, బి. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మోహన్ రావ్ పటేల్ ఆర్థిక సాయం అందజేత



**భైంసా, మే 4 (జనస్వరం) :** ఈ రోజుల్లో మానవత్వం తగ్గిపోతున్న కాలంలో, మోహన్ రావ్ పటేల్ తమ ప్రజా ట్రస్ట్ ద్వారా మానవత్వానికి మళ్లీ ప్రాణం పోస్తున్నారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. "నాకు ఉన్న దాంట్లోనే పేద ప్రజలకు ఆర్థిక సాయం అందించాలనే లక్ష్యంతో ఈ ట్రస్ట్‌ను స్థాపించాను" అని మోహన్ రావ్ పటేల్ తెలిపారు. భైంసా మండలం దేగాం గ్రామానికి చెందిన మగిలి రాజు, లింగావ్వ దంపతుల ఇల్లు కొద్ది రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా కాలిపోయింది. ఇంట్లోని వస్తువులు, దుస్తులు అన్నీ పూర్తిగా అగ్నికి ఆహుతి కాగా, కుటుంబం రోడ్డు మీద నిలబడే పరిస్థితి ఎదురైంది. ఈ విషయాన్ని తెలుసుకున్న మోహన్ రావ్ పటేల్, ఆదివారం గ్రామస్తులతో కలిసి రాజు ఇంటిని సందర్శించారు. అక్కడ కాలిపోయిన ఇంటిని పరిశీలించిన ఆయన, తమ మోహన్ రావ్ పటేల్ ప్రజా ట్రస్ట్ ద్వారా రూ.10,000 నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ రావ్ పటేల్ మాట్లాడుతూ, "అనుకోకుండా జరిగే ప్రమాదాల్లో ప్రజలకు భరోసా కల్పించడమే మా ట్రస్ట్ లక్ష్యం" అని పేర్కొన్నారు. ఆయన వెంట అయిండ్ల ముత్యం, గ్రామస్థులు ఉన్నారు. మోహన్ రావ్ పటేల్ చేసిన సాయాన్ని గ్రామ ప్రజలు హర్షించారు.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం

**జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**



**పాలకొల్లు, మే 4 (జనస్వరం) :** ఆదివారం పాలకొల్లు మండలం ఆగర్తి పాలెం గ్రామంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పర్యటించారు. అకాల వర్షాల కారణంగా కల్లాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. రైతులు తడి, పొడి ధాన్యాన్ని వేరు చేసి రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలన్నారు. మిల్లర్స్ తడిసిన ధాన్యాన్ని సేకరించి రైతులను ఆదుకోవాలని సూచించారు, దీనికి మిల్లర్స్ అందరూ సహకరిస్తామని తెలిపారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందకుండా రైతులు పండించిన ధాన్యాన్ని సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాల ద్వారా అమ్ముకోవాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గోనె సంచులు అందుబాటులో ఉంచాలన్నారు. వాహనాలను, హమాలీలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్భంలో ఆర్డీఓ దాసిరాజు, ఎంఏఓ కె.రాజశేఖర్, వీఆర్వోలు, విఏవోలు, రైతులు, తదితరులు ఉన్నారు.

# ముక్కంటిని మురిపిస్తున్న భక్తజనం

**భక్తుల సందడితో కళకళలాడుతున్న శ్రీగిరి క్షేత్రం**



**శ్రీశైలం, మే 4 (జనస్వరం) :** శ్రీశైలమహాక్షేత్రం భక్తులతో కళ కళలాడుతుంది. ఆదివారం కావడంతో ముక్కంటిని మురిపించడానికి తెలుగు రాష్ట్రాల నుండియే గాక పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుండి భక్తులు స్వామివార్లను దర్శించుకునేందుకు శ్రీశైలం తరలివచ్చారు. శనివారం రాత్రికే క్షేత్రంలో భక్తుల సందడి ప్రారంభమైంది. ఆదివారం వేకువజామునే భక్తులు కల్యాణ కట్ట వద్ద తలనీలాలు తీయించుకుని పవిత్ర పుణ్య నది పాతాళ గంగలో పుణ్య స్నానాలాచరించి 3 గంటల నుంచి స్వామివార్ల దర్శనాలకు బారులు తీరారు. భక్తులతో శీఘ్ర, అతిశీఘ్ర, ప్రత్యేక క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. అభిషేకాలు నిర్వహించుకునే భక్తులకు విడతల వారిగా స్వామివార్ల దర్శనం కల్పిస్తున్నారు. దర్శనానతరం భక్తులు స్వామివార్ల నిత్యాన్నదాన భవనంలో స్వామివార్ల ప్రసాదం వద్ద, లడ్డుప్రసాదం విక్రయకేంద్రాల వద్ద భక్తులు బారులు తీరారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ అధికారులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా తృప్తికరంగా స్వామివార్ల నుదర్శించుకునే విధంగా ముందస్తు చర్యలు తీసుకున్నారు. భక్తులతో ఆలయప్రాంగణం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్లను దర్శించుకుని భక్తులు పునీతులవుతున్నారు. సుమారు 60వేల మంది భక్తులు స్వామివార్ల ను దర్శి చుకుని ఉంటారని ఆలయ అధికారులు అంచనా. భక్తుల రద్దికారణంగా క్షేత్రమాడ వీధులు కళకళలాడాయి. సాక్షిగణపతి ఆలయం వద్ద వాహనాల రాకపోకలవల్ల భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. వేసవి సెలవులు కారణంగా, విద్యార్థుల పరీక్షా ఫలితాలు వెలువడిన కారణంగా స్వామివార్లకు మొక్కులు తీర్చుకునేందుగాను వస్తున్న భక్తులకు త్వరగతిన స్వామివార్ల దర్శనభాగ్యం కలిగేరీతిగా దేవస్థానం అధికారులు ముందస్తుగా ఏర్పాట్లను చేశారు. స్వామివార్లదర్శనం తదుపరి భక్తులు శ్రీశైలపరిధిలోని ఉపాలయాలైనటువంటి శిఖరేశ్వరం, హఠకేశ్వరం, పాలధార-పంచధార, సాక్షి గణపతి ఆలయాలను సందర్శించి స్వామివార్లను దర్శించుకుని పునీతులవుతున్నారు.

# రాజుపాలెం టీడీపీ అధ్యక్షులుగా హేమంత్ ఏకగ్రీవ ఎన్నిక



**ద్వారక తిరుమల, మే 4 (జనస్వరం) :** మండలంలోని రాజుపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షులుగా దేవరపల్లి హేమంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గోపాలపురం నియోజకవర్గం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, మండల పార్టీ అధ్యక్షులు లంకా సత్యనారాయణ ఆదేశాల మేరకు రాజుపాలెం గ్రామ టీడీపీ సమావేశం మాజీ జడ్పీటీసీ సభ్యులు దేవరపల్లి వీరస్వామి చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షులుగా దేవరపల్లి హేమంత్ ప్రధాన కార్యదర్శి గామానికల వేములయ్యా బూత్ ఇన్చార్జిగా మనుబోలు యేసు రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవరపల్లి రాయుడు బాబు, పాల కేంద్రం అధ్యక్షులు మనవర్తి శ్రీరాములు, కంకిపాటి శ్రీను, మాజీ సర్పంచ్ మానీకల బుల్లియ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అధ్యక్షులుగా ఎన్నికైన దేవరపల్లి హేమంత్ కి నాయకులు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

# జిల్లాలో ధాన్యం సేకరణ 2.50 లక్షల మెట్రిక్ టన్నులకు టార్గెట్ పెంపు

**కొవ్వలిలో పర్యటించిన జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి**



**దెందులూరు, మే 4 (జనస్వరం) :** మండలంలోని కొవ్వలిలో ఆదివారం రైతుల ఆరబెట్టుకున్న ధాన్యాన్ని పరిశీలించి, రైతుల సమస్యలను జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అడిగి తెలుసుకున్నారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని వెంటనే లిఫ్ట్ చేసేందుకు అవసరమైన లారీలను ఏర్పాటు చేయాలని, సంబంధిత అధికారులు ఆదేశించారు. రైతు సేవ కేంద్రాల్లో దాన్యం సేకరణ లక్ష్యాలను పెంచేందుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు తగినన్ని టార్పలిన్స్ అందించాలని రైతు సేవా కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. రైతుల విజ్ఞప్తి మేరకు జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని 2.50 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శని, ఆదివారం వచ్చిన అకాల వర్షాలకు గాను రైతులు వద్దనుండి ధాన్యం కొనుగోలుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. రైతులు ఎవరు ఆందోళన చెందకుండా వారి సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రంలో వారి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవాల్సిందిగా తెలిపారు. జిల్లాలో ఇంతవరకు రైతు సేవా కేంద్రాలు ద్వారా 51,32,300 గోనే సంచులను రైతులకు సరఫరా చేసి ఇంతవరకు 2.05 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. రైతుల కోరిక మేరకు పెంచిన లక్ష్యానికి అనగా 0.45 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యానికి గాను 11.25 లక్షల గోనెసంచాల అవసరం కాగా ప్రస్తుతం 8,95,410 గోనే సంచులు రైతు సేవా కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. పెంచిన ధాన్యం కొనుగోలు లక్ష్యానికి అనుగుణంగా రైతు సేవా కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి వచ్చినప్పుడు రైతులకు ఎటువంటి అసౌకర్యం కల్పించకుండా ట్రక్ షీట్ నమోదు చేసి రైస్ మిల్లులు పంపాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న అన్ని రైస్ మిల్లుల యాజమాన్యాలు రైతుల వద్ద నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల మేనేజర్ పి.శివరామమూర్తి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ భాషా, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల అధికారి వై భాను ప్రతాప్ రెడ్డి,పలువురు వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# కొవ్వలిలో ఘనంగా పుంతల ముసలమ్మ అమ్మవారి జాతర

**భారీ అన్నదానం పాల్గొన్న వందలాదిమంది భక్తులు**





**దెందులూరు, మే 4 (జనస్వరం) :** చల్లని తల్లిగా పేరుపొందిన మండలంలోని కొవ్వలి గ్రామ దేవత పుంతల ముసలమ్మ తల్లి జాతర ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. అమ్మవారిని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ పుంతల ముసలమ్మ తల్లి ఆలయ ధర్మకర్త ఆలపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం రాష్ట్ర నాయకులు నెరుసు వెంకటసుబ్బయ్య యాదవ్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆలయ ధర్మకర్త పాలపాటి రామకృష్ణ, మల్లవరపు రంగారావు, సాగునీటి సంఘం అధ్యక్షులు నేర్సు వెంకటరమణ, గోదావరి కాలువ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ వెలమాటి రామచంద్ర ప్రసాద్ (రాంబాబు), గుత్తా రాజా, వెలమాటి బుడ్డీలు, వడ్లపట్ల పండు, గారపాటి శ్రీను, వడ్లపట్ల బాచి, గారపాటి రామకృష్ణ, బలుసు శ్రీనివాసరావు, జి.వీర రాఘవులు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



**బొంరాస్‌పేట, మే 4 (జనస్వరం) :** మండల పరిధిలోని దుప్చర్ల గ్రామంలోని వాగు నుండి ఆదివారం సాయంత్రం ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న TS34G5210 నంబర్ గల ట్రాక్టర్‌ను పట్టుకుని ఓనర్ కం డ్రైవర్ జగదీష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రావుఫ్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రావుఫ్ తెలిపారు.

# పెరుగు గూడెంలో శ్రీ దక్షిణ ముఖ విఘ్నేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ట కార్యక్రమం


- ఆలయ పునః ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతమనేని, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని



**దెందులూరు, మే 4 (జనస్వరం) :** మండలంలోని పెరుగుగూడెం గ్రామంలోని శ్రీ దక్షిణ ముఖ విఘ్నేశ్వర స్వామి ఆలయ పున ప్రతిష్టా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా అగ్ని హెూమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వర స్వామిని టీడీపీ రాష్ట్ర ఫైర్ బ్రాండ్ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు విఙ్ఞేశ్వర స్వామిని దర్శించుకుని ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొన్నారు. పెరుగుగూడెం గ్రామ మాజీ సర్పంచ్ యలమర్తి హేమ శ్రీనివాస్, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు పావులూరి దశరథరామయ్య, గ్రామ సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణతో పాటు పలువురు స్వామివార్లను దర్శించుకున్నారు. విఘ్నేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ పున ప్రతిష్టా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పునప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులుకు ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో షాలు పూలదండతో సత్కరించారు. అనంతరం పెరుగు గూడెం విఙ్ఞేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున విఙ్ఞేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

# పాలగూడెంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిళ రెడ్డి పర్యటన

**అకాలవర్షాలకు నష్టపోయిన ధాన్యం రైతులను పరామర్శ**



**దెందులూరు, మే 4 (జనస్వరం) :** ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ రెడ్డి సోమవారం ఏలూరు రూరల్ మండలం మల్కాపురం రైతు సేవా కేంద్రం వద్ద ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అకాలవర్షాలకు కళ్లాలలో వున్న ధాన్యం తడసి తీవ్ర నష్టానికి గురైన రైతులను పరామర్శించేందుకు వస్తున్నారని నియోజకవర్గ ఇన్చార్జి కన్వీనర్ అలపాటి నరసింహామూర్తి అన్నారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు, మండల కాంగ్రెస్ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యునిగా లోవరాజు



**ప్రత్తిపాడు, మే 4 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) కాకినాడ జిల్లా కార్యవర్గ సభ్యునిగా మండలానికి చెందిన విశాలాంధ్ర రిపోర్టర్ బర్ల లోవరాజు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆది వారం కాకినాడ జేఎన్టీయూ అల్యూమినియం హాల్‌లో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కి ంగ్ జర్నలిస్టుల జిల్లా సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిలుగా మాజీమంత్రి, సీనియర్ టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్సీలు కర్రీ పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, తదిత రులు హాజరయ్యారు. ఈ సమావేశం అనంతరం నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల అధికారులుగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు, సీనియర్ జర్నలిస్టులు కే స్వాతి ప్రసాద్, దుర్రానిలు వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన లోవరాజును ఎన్నుకున్నారు. ప్రత్తిపాడు ప్రెస్ క్లబ్ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

# వికలాంగుల సంక్షేమానికి ప్రత్యేక రాయితీలు కల్పిస్తాం

**జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం**

**నూతన కార్యవర్గం ఏకగ్రీవం**



**నంద్యాల మే 4 (జనస్వరం) :** జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో గౌరవాధ్యక్షులుగా డాక్టర్ గుర్రాల రవికృష్ణ, గౌరవ సలహాదారుగా వెదుర్ల రామచంద్రరావు, అధ్యక్షులుగా ఎంపీవి రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా రామలింగం, కోశాధికారిగా రామకృష్ణ, సలహా మండలి సభ్యులుగా డాక్టర్ మధుసూదనరావు, ఏవిఆర్ ప్రసాద్, లాలి స్వామి, షేక్షావలి రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా హనీఫ్ ఖాన్, ఉపాధ్యక్షులుగా సుబ్బారెడ్డి, వెంకటరావు, ఆవుకు రంగడు, రంగస్వామి సంయుక్త కార్యదర్శులుగా ఇంతియాజ్, మధు కుమార్, వీరభరతుడు, మహిళా విభాగం కన్వీనర్‌గా కళ్యాణి, ఉద్యోగస్తుల విభాగం కన్వీనర్‌గా రామ కిషోర్ వీరితో పాటు కార్యవర్గ సభ్యులుగా చలపతి, శ్రీనివాసులు, దుర్గారావు, కిరణ్ కుమార్, నబిరసూల్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యవర్గ సమావేశంలో దివ్యాంగుల సమస్యలపై విస్తృతంగా చర్చించారు. గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, అధ్యక్షులు రమణయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్ మూడు వేల నుండి ఆరు వేలకు పెంచినందుకు, దివ్యాంగ క్రీడాకారులకు ఉద్యోగ విద్యా అవకాశాలలో స్పోర్ట్స్ కోటాలో చేర్చినందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. అర్హత ఉన్న దివ్యాంగులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని, ఇంటి స్థలాలు, ఇళ్ల కేటాయించేటప్పుడు దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు తమ బడ్జెట్‌లో విధిగా ఐదు శాతం దివ్యాంగుల సంక్షేమానికి వినియోగించాలని, ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ స్థలాలలో దివ్యాంగుల సౌకర్యం కోసం రాంపులు ఏర్పాటు చేయాలని, అంత్యోదయ కార్డులు అర్హత కలిగిన దివ్యాంగులకు మంజూరు చేయాలని, దివ్యాంగుల స్వయం సహాయక గ్రూపులు ఏర్పాటు చేసి స్వయం ఉపాధి అవకాశాలు పెంచాలని, దివ్యాంగులలో అవసరమైన వారికి మూడు చక్రాల సైకిళ్లు, స్కూటర్లు, చక్రాల కుర్చీలు, వినికిడి యంత్రాలు ఇతర ఉపకరణాలు అందజేయాలని కోరారు. కేంద్ర దివ్యాంగుల రక్షణ చట్టంపై పోలీసు, ఇతర ప్రభుత్వ అధికారులకు ప్రభుత్వం అవగాహన కల్పించి దివ్యాంగుల హక్కులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుల హక్కులు, రక్షణ చట్టంపై అవగాహన పెంచడానికి త్వరలోనే సదస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినెల అవసరమైన వారికి మందుల పంపిణీ, ప్రత్యేక ఉపకరణాలు అందజేయడం వంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామన్నారు. దివ్యాంగులు తమ సమస్యల పరిష్కారం కోసం నంద్యాల బాలాజీ కాంప్లెక్‌లో ఉన్న నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. జిల్లా కార్యవర్గ సమావేశాలు తరచు నిర్వహించి దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో దివ్యాంగులు, జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## వైసీపీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేయాలి

**నరసాపురం పార్లమెంటరీ పరిశీలికులు ముదునూరి మురళి రాజు**



**ప్రత్తిపాడు, మే 4 (జనస్వరం) :** వైసీపీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేయాలని నరసాపురం పార్లమెంటరీ పరిశీలికులు ముదునూరి మురళి రాజు అన్నారు. ఈ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పార్లమెంట్ భీమవరంలో వైసీపీ సమన్వయ కమిటీలో సమావేశంలో నరసాపురం పార్లమెంటరీ పరిశీలికులుగా నియమితులైన సందర్భంగా ముదునూరి మురళీకృష్ణ రాజు మొట్టమొదట సారిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళిరాజు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజల్లోకి గ్రామస్థాయి నుండి నియోజవర్గ స్థాయి వరకు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మురళిరాజు సూచించారు. అలాగే ఏడు నియోజకవర్గాల్లో రానున్న సాధారణ ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగరవేయాలని మనం అందరూ కలిసికట్టుగా పనిచేసి విజయం సాధించాలన్నారు. వైసీపీ నాయకులు కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేయాలని నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యల మీద పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్లమెంటరీ పరిశీలికులుగా నియమితులై మొట్టమొదటిసారిగా విచ్చేయడంతో మురళి రాజును వైసీపీ నాయకులు సాలువాలు పూలదండలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు, తణుకు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ మంత్రి కానుమూరి నాగేశ్వరరావు, ఉండి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త పివిఎల్ నరసింహ రాజు, పాలకొల్లు నియోజవర్గ సమన్వయకర్త గుడాల గోపి, ఎమ్మెల్సీ కౌవురు శ్రీనివాస్, ఎంపీపీలు, జడ్పిటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## అంకాలమ్మ తల్లి సన్నిధిలో అతిరథ మహారధులు

**- అమ్మవారిని దర్శించి తరించిన, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, కాకర్ల సురేష్, ఉగ్ర నరసింహారెడ్డి, ఎమ్మెల్సీలు, బీద రవిచంద్ర, కంచర్ల శ్రీకాంత్**



**నెల్లూరు, మే 4 (జనస్వరం) :** ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామస్తులచే నూతనంగా అత్యంత ప్రతిష్టంగా అతి సుందరంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ అంకాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం మూడు రోజులుగా అత్యంత భక్తి శ్రద్ధలతో పురోహితుల మంత్రోచ్చరణల నడుమ వైభవంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి రాజా, ఆలయ కమిటీ అతిరద మహారధులను ఆహ్వానించింది. ఆహ్వానం మేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కంచర్ల శ్రీకాంత్ లు అమ్మవారి సన్నిధికి చేరుకొని, గ్రామదేవత అంకాలమ్మ తల్లి సేవలో తరించారు. పురోహితులు గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న నేతలకు ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వాదాలు అందించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, సమిష్టిగా ఐకమత్యంతో గ్రామ దేవత శ్రీ అంకాలమ్మ తల్లి ఆలయాన్ని అత్యంత సుందరంగా నిర్మించినందుకు గ్రామస్తులందరిని అభినందించారు. ఆలయం వరకు సిసి రోడ్డును ఏర్పాటు చేస్తామని తెలిపారు. మెట్ట ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని రానున్న రోజుల్లో ఉదయగిరిని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. నేతల వెంట మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మీ నాయుడు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పొన్నుబోయిన చంచల్ బాబు యాదవ్ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి వరికుంటపాడు మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు ధర్మవరం నాయకులు ముజ్జే లక్ష్మీనారాయణ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ వింజమూరు మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య కాకర్ల వెంకట్ కడియాల వెంకటేశ్వర్లు గణపం సుదర్శన్ రెడ్డి మంచాల శ్రీనివాసులు నాయుడు, రాజా, సీతారామపురం మండల కోఆర్డినేటర్ వింతల శ్రీనివాసులు, ఉదయగిరి మండల కన్వీనర్ సిహెచ్ బయన్న చీకుర్తి రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## వీపీఆర్, అమృత ధార మెట్ట ప్రాంతానికి ఒక వరం

**- పెద్దిరెడ్డి పల్లెలో వీపీఆర్ అమృత ధార వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన అతిరథ మహారధులు**



**నెల్లూరు, మే 4 (జనస్వరం) :** వీపీఆర్ అమృత ధార మెట్ట ప్రాంతానికి ఒక వరమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లాలోని వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి గ్రామంలో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటుచేసిన అమృత ధార వాటర్ ప్లాంట్‌ను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర కంచర్ల శ్రీకాంత్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం మహిళలకు బిందెలతో నీటిని అందజేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా జిల్లావ్యాప్తంగా సుమారు 200కు పైగా వీపీఆర్ అమృత దార పేరుతో నెలకొల్పడం జరిగిందన్నారు. వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన తర్వాత దాని మరమ్మత్తుల ఖర్చులు కూడా విపిఆర్ ఫౌండేషన్ భరిస్తుందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించడం కోసం వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో ఎక్కువగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో ఫ్లోరిన్ అధికంగా ఉందని కిడ్నీ వ్యాధిగ్రస్తులు కూడా రోజురోజుకు పెరుగుతున్నారన్నారు. అందుచేత అవసరమైన చోట్ల వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా మరిన్ని వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తానని ఫౌండేషన్ అధినేత వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఉదయగిరి ప్రాంతాన్ని అక్కున చేర్చుకొని అడిగిన వెంటనే ఆపద్బాంధవుడు వలె వీపీఆర్ అమృతధారను అందిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు, టీడీపీ నాయకులు రాజా, పెద్దిరెడ్డిపల్లి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మీ నాయుడు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పొన్నుబోయిన చంచల్ బాబు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, వరికుంటపాడు మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు, ధర్మవరం నాయకులు ముజ్జే లక్ష్మీనారాయణ, రాజా, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు, సీతారామపురం మండలం కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు, యాదవ్, సీనియర్ నాయకులు ఉండేలా గురువారెడ్డి ,దుత్తలూరు కన్వీనర్ వెంకటరత్నం, ఉదయగిరి కన్వీనర్ సిహెచ్ బయన్న, వనిపెంట సుబ్బారెడ్డి, జూపల్లి రాజారావు, గణపం సుదర్శన్ రెడ్డి, మంచాల శ్రీనివాస్ నాయుడు, వింజమూరు మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య కాకర్ల వెంకట్ కడియాల వెంకటేశ్వర్లు తాటికొండ అనూష మాజీ జెడ్పిటిసి సభ్యులు కలివేల జ్యోతి చీకుర్తి రవీంద్రబాబు లెక్కల వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేవైసీ గడువు పొడిగింపు అభినందనీయం

**జీకే వీధి బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్**



**చింతపల్లి/జీ.కే వీధి, మే 4 (జనస్వరం) :** మండలంలోని రేషన్ లబ్ధిదారులకు కేవైసీ ప్రక్రియ కోసం గడువు జూన్ 30 వరకు పొడిగించినందుకు బీజేపీ మండల అధ్యక్షుడు కాకూరు శేఖర్ హర్షం వ్యక్తం చేశారు. మునుపటి గడువు ఏప్రిల్ 30తో ముగియగా, మారుమూల గ్రామాలలో ఇంకా చాలామంది లబ్ధిదారులు ఈ ప్రక్రియను పూర్తి చేయకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయ న్నారు. గూడెం కొత్త వీధిలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ మండలంలో 16 పంచాయితీల పరిధిలో అనేక గ్రామాలలో ఇంకా కేవైసీ ప్రక్రియ పూర్తికావలేదని పేర్కొన్నారు. ముఖ్యంగా పాఠశాల లు, కళాశాలలో చదువుతున్న విద్యార్థులు వేసవి సెలవుల్లో స్వగ్రామాలకు వచ్చిన సమయంలో ఈ ప్రక్రియకు మెరుగైన స్పందన కనిపించిందన్నారు. విద్యార్థులు ఈ సమయాన్ని ఉపయోగించుకొని కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవడానికి ఉత్సాహం చూపుతున్నారని వెల్లడించారు. రేషన్ కేవైసీ ప్రక్రియను జూన్ 30 వరకు పొడిగించడం మారుమూల ప్రాంతాల ప్రజలకు ఎంతగానో ఉపయో గపడుతుందని, దీనివల్ల లబ్ధిదారులు తమ రేషన్ పొందడంలో ఎలాంటి అంతరాయం కలగదని శేఖర్ అభిప్రాయపడ్డారు. గ్రామాలలోని రేషన్ కార్డు దారులందరూ ఈ గడువు ముగిసేలోగా కేవైసీ పూర్తి చేయాలని సూచిస్తూ, గడువు పెంచిన అధికారులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సిమెంటు రోడ్డుకు వేశారు.. మట్టి పొయ్యడం మరిచారు

**- ప్రమాదంలో ప్రజల ప్రాణాలు**

**- వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్**



**చింతపల్లి/అరకులోయ, మే 4 (జనస్వరం) :** గ్రామీణ అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలతో ముందుకు సాగుతోంది. గ్రామీణ రహదారుల అభివృద్ధి కోసం పంచాయతీరాజ్ శాఖ ఉపాధి హామీ పథకం నిధులను వినియోగిస్తూ కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. ఈ క్రమంలో పలుచోట్ల సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నా, పనుల నాణ్యతపై తగిన పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అరకులోయ మండలంలోని కొత్తవలస జంక్షన్ నుండి తహసీల్దార్ కార్యాలయం జంక్షన్ వరకు సీసీ రోడ్డు మూడు నెలల క్రితం వేసినప్పటికీ, ఆ రోడ్డుకు ఒకవైపు బర్మ్‌ల మట్టి వేయడం గుత్తేదారుడు మర్చిపోయారు. దాంతో రాత్రివేళల వాహనదారులు ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. రోడ్డుకి పక్కనే లోతుగా ఉండడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. లైటింగ్ కూడా తక్కువగా ఉండటంతో ప్రమాదభయంతో ప్రయాణిస్తున్నాం, అని ఓ వాహనదారు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇది ఒకేఒక్క రహదారి సమస్య కాదు. మండలంలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. రోడ్డుకు ఇరువైపులా బర్మ్‌ల మట్టి లేకపోవడం, మురుగు నీరు నిలిచిపోవడం వలన రహదారులు త్వరగా దెబ్బతింటున్నాయి. ప్రజలు సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెంటనే స్పందించి రోడ్డు ఇరువైపులా మట్టిని వేయించి, సురక్షిత ప్రయాణానికి మార్గం సుగమం చేయాలని కోరుతున్నారు. అధికారుల స్పందనకై ప్రజలు ఎదురుచూస్తున్నారు.

## సీనియర్ జర్నలిస్టుకి ఘన సత్కారం




**ప్రత్తిపాడు, మే 4 (జనస్వరం) :** ప్రత్తిపాడుకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఎస్వీ సోమేశ్వరరావుకు ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా మహాసభ ఘనంగా సన్మానించింది. కాకినాడ జేఎన్టీయూలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఏపీయూడబ్ల్యూజే కాకినాడ జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్సీలు కర్రి పద్మ, పేరాబత్తుల రాజశేఖరం, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐవి సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు కేవివి స్వాతిప్రసాద్, సీనియర్ జర్నలిస్టులు మండేలా శ్రీరామ్మూర్తి, దుర్రానీ తదితదులు హాజరయ్యారు. ఈ సభలో యనమల రామకృష్ణుడు చేతనమీదుగా సన్మానం అందుకున్న సీనియర్ జర్నలిస్ట్ ఎస్వీ సోమేశ్వరరావును స్థానిక ప్రస్తుత సభ్యులు అభినందించారు.

## శ్రీ లక్ష్మీ విద్యారణ్య మహర్షి విద్యాలయం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**బద్వేల్, మే 4 (జనస్వరం) :** ఇరవై సంవత్సరాల అనంతరం, వైఎస్సార్ జిల్లా బద్వేల్ మండలంలోని శ్రీ లక్ష్మీ విద్యారణ్య మహర్షి విద్యాలయం 2004-05 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు మే 4, 2025న ఘనంగా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అప్పటి కరెస్పాండెంట్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది హాజరయ్యారు. వివిధ ఉద్యోగాల్లో స్థిరపడిన విద్యార్థులు తమ కుటుంబాలతో కలిసి హాజరై, పాఠశాలలో గడిపిన మధురమైన రోజులను గుర్తు చేసుకుంటూ అనుభూతులను పంచుకున్నారు. "మిమ్మల్ని ఇలా చూసేటప్పుడు మాకు గర్వంగా ఉంది," అంటూ ఉపాధ్యాయులు భావోద్వేగంగా స్పందించారు. విద్యార్థులంతా కలిసి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి, పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆటపాటలతో అందరూ కలిసి మధురమైన క్షణాలను ఆస్వాదించారు. చివరగా ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపి, ఇలాంటి సమ్మేళనాన్ని భవిష్యత్తులో మరొకసారి నిర్వహించాలని తీర్మానిస్తూ కార్యక్రమాన్ని ముగించారు.

## ప్రేరణ, పట్టుదలతో అద్భుతమైన విజయాలు సాధించవచ్చు

**- ప్రతీ విద్యార్థి సమయం విలువ తెలుసుకోవాలి**

**- మనిషి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైనది**


**- కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్**



**గుంటూరు, మే 4 (జనస్వరం) :** ప్రేరణ, పట్టుదలతో పాటూ కఠోరశ్రమతో అద్భుతమైన విజయాలు సాధించవచ్చని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని తన కార్యాలయంలో పదవ తరగతిలో 600కి 594 మార్కులు సాధించిన జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి కుమార్తె ఆళ్ళ యామినీ విద్యాధరిని అయన ప్రత్యేకంగా అభినందించి, స్వీట్లు తినిపించారు. ఉపాధ్యాయుల గైడెన్స్ తీసుకొని పక్కా ప్రణాళికతో చదివితే విజయాలు వాటంతట వచ్చే వశమవుతాయని అయన పేర్కొన్నారు. సృష్టిలో ఎవరికైనా రోజుకి 24 గంటలేనని, ప్రతీ విద్యార్థి సమయం విలువ తెలుసుకోవాలని ముందుకు సాగాలన్నారు. మనిషి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైందన్నారు, చదువు నుంచి దృష్టి మరల్చే వాటిపై విద్యార్థులు నిరంతరం జాగరూకతతో ఉండాలన్నారు. ఎంతో కష్టపడి చదివిస్తూ ప్రాణమంతా బిడ్డల మీదే పెట్టుకొని బ్రతికే తల్లితండ్రుల ఆశలకు తగ్గట్టుగా పిల్లలు విద్యలో రాణించాలన్నారు. యామినీ విద్యాధరి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సివిల్ సర్వీసెస్‌కి ఎంపికై ప్రజలకు, సమాజానికి సేవలందించాలని పెమ్మసాని చంద్రశేఖర్ యామినీకి సూచించారు.

## విద్యుత్ శాఖకే వన్నెతెచ్చిన వ్యక్తి రాజారెడ్డి

**రైతుల కోసం అహర్నిశలు పనిచేశారు**




**ఓడిచెరువు, మే 4 (జనస్వరం) :** విద్యుత్ శాఖలో పనిచేస్తూ రైతుల కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి రాజారెడ్డి అని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కొనియాడారు. ఇటీవల ఓడిచెరువు సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తూ ఇటీవల పదవీ విరమణ పొందిన బీద రాజారెడ్డికి కదిరి దత్తా ఫంక్షన్ హాల్‌లో పదవి విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడారు. ఆమడగూరు మండలం తుమ్మల పంచాయతీలోని సద్దపల్లిలో రైతు రంగారెడ్డి, నారాయణమ్మకు 4వ సంతానంగా జన్మించిన రాజారెడ్డి 1984లో విద్యుత్ శాఖలో చిరు ఉద్యోగిగా చేరి 40 ఏళ్లుగా పనిచేసి మచ్చలేని వ్యక్తిగా విద్యుత్ శాఖలో రాజారెడ్డి పనిచేశారు. విద్యుత్ శాఖపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉన్నప్పటికీ రాజారెడ్డి లాంటి మంచి వ్యక్తి ఈ శాఖలో ఉండడం గర్వకారణమన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా రాజారెడ్డి విద్యుత్ శాఖ తరపున మంచి సేవలు అందించారని తెలిపారు. రాజారెడ్డి ఈ స్థాయికి రావడానికి అతని భార్య రానెమ్మ కారణమన్నారు. ఈ దేశానికి రైతే రాజులా ఈ విద్యుత్ శాఖలో రాజారెడ్డి రాజులా రైతులకు సేవలు అందించారని, ఆయనకు వెన్నంటి రాణిలా అతని భార్య రాణెమ్మ ముందుకు నడిపించారని పేర్కొన్నారు. రాజారెడ్డి, అతని భార్య రాణేమ్మ ఆయురు ఆరోగ్యాలతో జీవితం గడపాలని ఆ భగవంతున్ని కోరుకొంటున్నానట్లు తెలిపారు. అనంతరం పదవి విరమణ పొందిన రాజారెడ్డి, రానెమ్మ దంపతులను ఆశీర్వదించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, బంధు మిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబును విమర్శిస్తుంటే పల్లా కనీసం నోరు మెదపడం లేదు

**- వైసీపీ కోవర్టుగా మారిన పల్లాను తక్షణమే అధ్యక్ష స్థానం నుంచి తొలగించాలి**

**- తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్**




**విశాఖపట్నం, మే 4 (జనస్వరం) :** చంద్రబాబును వైసీపీ నాయకులు విమర్శిస్తున్నప్పటికీ కనీసం నోరు మెదపలేని స్థితిలో.. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అ పల్లా శ్రీనివాసరావు ఉన్నారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. పల్లా శ్రీనివాసరావు వైసీపీ కోవర్టుగా వ్యవహరిస్తున్నారని దీనికి సంబంధించి పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని రామ్ తెలిపారు. ఆదివారం ఉదయం హోటల్ దస్పల్లాలో "కాఫీ విత్ పల్లా శ్రీనివాసరావు బై బి.వి. రామ్" పేరుతో ఒక కార్యక్రమం ఏర్పాటు చేశారు. వాస్తవానికి తనపై పల్లా శ్రీనివాసరావు, అతని అనుచరులు చేస్తున్న ఆరోపణలపై ముఖాముఖి చర్చకు హోటల్ దసపల్ల వేదికగా ఏర్పాటు చేసుకొని ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేశారు. అయితే పల్లా శ్రీనివాసరావు గాని ఆయన అనుచరులు గాని కాఫీ విత్ పల్ల కార్యక్రమానికి హాజరు కాలేదు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిరీక్షించిన అనంతరం బివి రామ్ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుపై ఇష్టానుసారంగా విమర్శలు చేసిన గుడివాడ అమర్ అక్రమ నిర్మాణాన్ని కూల్చకపోతే నీకు వచ్చిన నొప్పి ఏంటి అని పల్లా అనుచరులు తనను ప్రశ్నిస్తున్నారని.. అంటే వైసీపీ అక్రమాలకు పల్లా కొమ్ము కాస్తున్నట్టు అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా చేతకాని ప్రగల్భాలు పలకడం పల్లాకు, అతని అనుచరులకు అలవాటుగా మారిపోయిందన్నారు. ఇటీవల తిరుపతి గోశాలలో గోవుల మృతి నేపథ్యంలో చర్చకు వస్తానని చెప్పిన పల్లా ముఖం చాటేసారని.. రోజా బహిరంగంగానే విమర్శించారన్నారు. తాజాగా సింహాచలంలో ఘటన నేపథ్యంలో వైఎస్ జగన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేసినప్పటికీ కనీసం వల్ల శ్రీనివాసరావు స్పందించలేదన్నారు. ఇటువంటి వైసీపీ కోవర్టును తక్షణమే టీడీపీ రాష్ట్ర అధ్యక్ష స్థానం నుంచి తొలగించాలని టీడీపీ అధినేత చంద్రబాబుకు బి.వి.రామ్ విజ్ఞప్తి చేశారు. టీడీపీకి చెందిన నాయకులు ఎవరైనా వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు.

# కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం

**- నల్లమాడ మండల కేంద్రంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త భానుజ, దుర్గా మౌలాలి కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**



**నల్లమాడ, మే 4 (జనస్వరం) :** టీడీపీకి అహర్నిశలు కృషి చేసి అకస్మాత్తుగా మృతి చెందిన టీడీపీ కార్యకర్త భానుజా, మౌలాలి కుటుంబాలను ఆదివారం పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించారు. నల్లమాడ లో టీడీపీ కార్యకర్త భానూజ, మౌలాలి మృతి చెందారనే సమాచారాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ పల్లె హుటాహుటిన నల్లమాడకు విచ్చేసి బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బానుజ ,మౌలాలి భౌతిక కాయానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని మృతురాలు బానుజా భర్త నభి రసూల్ ను ఓదార్చారు. అలాగే మృతుడు మౌలాలి భార్య రమీజాను వారి కుటుంబాన్ని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఓదార్చి వారికి కొంత ఆర్థిక సాయాన్ని అందజేశారు. టీడీపీ కార్యకర్తల సంక్షేమమే పరమావధిగా చివరి శ్వాస ఉన్నంత వరకు పనిచేస్తానని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నల్లమాడ మండల టీడీపీ కన్వీనర్ మైలే శివశంకర్, టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు ఎస్పీ, పోలీసుల కృషి అమరావతి సభ విజయవంతానికి ఆదర్శం



**గుంటూరు సిటీ, మే 4 (జనస్వరం) :** ప్రధాని నరేంద్ర మోడీ అమరావతి పునఃప్రారంభ సభను విజయవంతంగా నిర్వహించడంలో గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ నాయకత్వంలోని పోలీసు విభాగం కీలక పాత్ర పోషించిందని జనసేన పార్టీ నాయకులు ప్రశంసించారు. ఈ నేపథ్యంలో, జనసేన పార్టీ నగర పాలక సంస్థ 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకట రమణ, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకట రత్తయ్య, నాయకులు సోమీ ఉదయ్, యర్ర గోపుల జయదీప్ తదితరులు గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సతీష్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత క్లిష్టమైన పరిస్థితుల మధ్య ఏవైనా అవాంఛనీయ ఘటనలు లేకుండా, ప్రజలకు, రైతులకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, సమర్థవంతమైన పకడ్బందీ ప్రణాళికతో ప్రధాని పర్యటనను విజయవంతం చేసిన గుంటూరు జిల్లా పోలీసు శాఖ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పోలీసు అధికారుల కృషి ప్రజలందరికీ ఆదర్శంగా నిలిచిందని జనసేన నేతలు ప్రశంసించారు.

# వెలగపూడిలో కూలిన విద్యుత్ హైఓల్టేజీ టవర్


**- ప్రధాని సభావేదికకు కూతవేటు దూరంలో ఘటన**

**- వైసీపీ హయాంలో బోల్టులు కాజేసిన దుండగులు**



**గుంటూరు, మే 4 (జనస్వరం) :** రాజధానిలోని వెలగపూడి గ్రామంలో విద్యుత్ హై ఓల్టేజీ ట్రాన్స్‌మిషన్ టవర్ కూలిపోయింది. ఆదివారం ఉదయం సంభవించిన గాలివాన బీభత్సానికి టవర్ పక్కకు పడిపోయింది. ఈనెల 2న ప్రధాని మోదీ సభ జరిగిన ప్రదేశానికి అతి సమీపంలోనే ఎన్-9 రోడ్డుకు దగ్గరలో ఈ-7, ఈ-8 రోడ్ల మధ్య ఈ టవర్ కూలిపోవడం గమనార్హం. ఆ సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రధాని సభ రోజున టవర్ కూలి ఉంటే పరిస్థితి చాలా దారుణంగా ఉండేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, టవర్ కూలిపోవడంతో ఆదివారం ఉదయం నుంచి వెలగపూడి ప్రజలు విద్యుత్ సరఫరా లేక ఇబ్బంది పడ్డారు. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కాగా, గత వైసీపీ ప్రభుత్వం రాజధాని నిర్లక్ష్యం చేసింది. దీంతో దుండగులు ఇనుము, కంకర, ఇసుకను ఇష్టారాజ్యంగా దోచుకుపోయారు. ఈ క్రమం లో కొందరు ఈ హైటెన్షన్ విద్యుత్ టవర్ల బోల్టులు, నట్లు, ఇనుప బద్దీలను కూడా పీక్కుపోయారని రైతులు చెబుతున్నారు. ఇలా బోల్టులు పీక్కుపోయిన టవర్లు ఇంకా పదికిపైగా ఉన్నాయని అంటున్నారు.

# కర్ణాటక పవన్ కళ్యాణ్ అభిమాన సంఘం అధ్యక్షుడు బాలాజీ నాయుడు ఆధ్వర్యంలో
# దారం అనితకు ఘన సత్కరింపు



**మదనపల్లి, మే 4 (జనస్వరం) :** కర్ణాటక రాష్ట్ర పవన్ కళ్యాణ్ అభిమాన సంఘం అధ్యక్షులు బాలాజీ నాయుడు వెంకటరమణ, సంపంగి, వి. బాలాజీ కలిసి, జనసేన పార్టీ "నా సేనకు నా వంతు" రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్, రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ దారం అనితను వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు దారం అనితకి పుష్పగుచ్ఛం, పండ్లతో సత్కరించారు. కార్యక్రమంలో భావోద్వేగ భరిత వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా బాలాజీ నాయుడు మాట్లాడుతూ, భవిష్యత్తులో కర్ణాటక రాష్ట్రంలో జనసేన పార్టీ ప్రస్థానం మరింత బలపడుతుందని, తమవంతు కృషి అందిస్తామని వెల్లడించారు. జనసేన అభివృద్ధి కోసం తమ సంఘం ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తుందని పేర్కొన్నారు.

# సినీ హీరో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఒక లెజెండ్

**- హిందూపురంలో హ్యాట్రిక్ హీరో బాలయ్యే**

**- ఈ ప్రాంతంలో నందమూరి కుటుంబానికి ఉన్న హిస్టరీని ఎవరు తిరగరాయలేరు.**

**- ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



**హిందూపురం, మే 4 (జనస్వరం) :** సినీ రంగంలోనే కాదు హిందూపురం ఎమ్మెల్యేగా ప్రజా రంగంలో కూడా నందమూరి బాలకృష్ణ ఒక లెజెండ్ అని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు కొనియాడారు. పద్మభూషణ్ అవార్డు గ్రహీత సినీ హీరో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కు హిందూపురంలోని ఎంజీఎం మైదానంలో నిర్వహించిన పౌర సన్మాన సభలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని హిందూపురం నియోజకవర్గానికి నందమూరి కుటుంబానికి ఒక ప్రత్యేకత ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలతో ఆ కుటుంబానికి ఉన్న అనుబంధం అభిమానం, ఆప్యాయత అనురాగం ప్రేమ మరువలేని అన్నారు. నందమూరి బాలకృష్ణ హిందూపురం ఎమ్మెల్యే గా హ్యాట్రిక్ హీరో అని కొనియాడారు. నందమూరి కుటుంబ హిస్టరీని చరిత్రలో ఎవరు తిరగరాయలేరని పేర్కొన్నారు. నందమూరి బాలకృష్ణ సినీ రంగంలో ఎన్నో మంచి చలనచిత్రాలను సమాజానికి అందించారని పేర్కొన్నారు. పైసా వసూల్, లెజెండ్, భైరవద్వీపం ఆదిత్య 369 ,ముద్దుల మామయ్య, చెన్నకేశవ రెడ్డి, సమరసింహారెడ్డి,గౌతమీ పుత్ర శాతకర్ణి ,అఖండ ,డాకు మహారాజ్ వంటి హిట్ సినిమాలు సమాజానికి మంచి సినిమాలు అందించారని కొనియాడారు. బాలకృష్ణ నటించిన చిత్రాల్లోని పంచ్ డైలాగులను మాజీ మంత్రి డాక్టర్ రఘునాథరెడ్డి గుర్తు చేశారు. హిందూపురంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో పద్మభూషణ్ అవార్డు అందుకున్న హిందూపురం ఎమ్మెల్యే సీని అగ్రహీరో పద్మభూషణ్ గ్రహీత నందమూరి బాలకృష్ణ తన సతీమణి వసుందరదేవికి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.పద్మభూషణ్ గ్రహీత సీని రంగానికి చెందిన అగ్రనాయకుడు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం, సత్యసాయి జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలయ్య అభిమానులు నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

# ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాల్సిందే

**ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ**



**హిందూపురం, మే 4 (జనస్వరం) :** దివంగత ముఖ్యమంత్రి, తన తండ్రి నందమూరి తారక రామారావుకు భారతరత్న పురస్కారం ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. పద్మభూషణ్ అవార్డు అందుకున్న సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో ఆదివారం ఆయనకు పౌరసన్మాన సభ ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు, అభిమానులు ప్రత్యేకంగా తయారు చేయించిన వెండి సింహాసనం, గద, కత్తి, పిల్లనగ్రోవిని బహూకరించారు. బాలకృష్ణ మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించానని, అది హిందూపురం ప్రజల విజయమని అన్నారు. తనకు పద్మభూషణ్ ప్రదానం చేసినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇచ్చి వారినివారే గౌరవించుకోవాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలను కోరారు. అనంతరం మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కందికుంట వెంకట ప్రసాద్, పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు బాలకృష్ణను ఘనంగా సత్కరించారు.


# ఎమ్మిగనూరులో ఆర్.ఎం. భాష పదవీ విరమణ సన్మానోత్సవ సభ



**ఎమ్మిగనూరు, మే 4 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ)లో 39 సంవత్సరాలపాటు సేవలందించిన ఆర్.ఎం. భాష బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు ముస్లిం మైనారిటీ కమ్యూనిటీ హాల్లో ఆదివారం నిర్వహించిన సన్మానోత్సవ సభలో ఘనంగా సత్కరించారు. ఆర్.ఎం. భాష కండక్టర్గా సేవలు ప్రారంభించి, తరువాత ఏ.డి.సి గా, టి.ఐ-3గా, ఆపై టి.ఐ-2గా పదోన్నతులు పొంది ఎన్నో సంవత్సరాలు విధులకు నిష్ఠతో పని చేశారు. ఆయన సేవలను గుర్తిస్తూ కర్నూలు-1, కర్నూలు-2, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆదోని డిపోల ఉద్యోగులు హాజరై ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కార్యదర్శులు ముస్తాక్ అహ్మద్ (ఎమ్మిగనూరు), హరిబాబు (ఆదోని)తో పాటు ఏపీఎస్ఆర్టీసీకి చెందిన పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు. పదవీ విరమణ అనంతరం ఆర్.ఎం. భాషకి ఆరోగ్యంతో, ఆనందంగా పదవీ విరమణ జీవితం సాగాలని శుభాకాంక్షలు తెలిపారు.

# బకింగ్ హాంలో గుర్రపుడెక్కను తొలగించండి

**సిబ్బందికి మంత్రి నారా లోకేశ్ ఆదేశం**



**అమరావతి, మే 4 (జనస్వరం) :** మంగళగిరి నియోజకవర్గం కాజ- చినవడ్లపూడి మధ్యలో గల బకింగ్ హాం కాలువను మంత్రి నారా లోకేశ్ ఆదివారం పరిశీలించారు. కాలువలో పెద్దఎత్తున గుర్రపు డెక్క పేరుకుపోవడాన్ని గమనించారు. వర్షాకాలంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా గుర్రపు డెక్కను తొలగించడానికి అవరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బదిని ఆయన ఆదేశించారు.

# కరెంటు సరఫరాకు అంతరాయం..

**- యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ**


**- అప్రమత్తంగా ఉండాలని సీఎం, మంత్రి ఆదేశాలు**



**అమరావతి, మే 4 (జనస్వరం) :** రాష్ట్రంలో ఆదివారం నాటి గాలివాన బీభత్సం కరెంటు సరఫరాకు అంతరాయం కలిగించడంతో పాటు చాలా చోట్ల విద్యుత్తు స్తంభాలు, ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. అయితే తక్షణమే స్పందించిన విద్యుత్తు సిబ్బంది కొన్ని గంటల్లోనే దెబ్బతిన్న ఫీడర్లను, విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. రాష్ట్రంలో భారీ గాలులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో విద్యుత్తు సరఫరా అంతరాయాలు, ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను ఆదేశించారు. దీంతో ఏపీ విద్యుత్తు పంపిణీ, సరఫరా, ఉత్పత్తి సంస్థలు అప్రమత్తమయ్యాయి. గాలివానలకు చెట్లు విరిగి తీగలపై పడటం వల్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగినా.. 11 కేవీ, 132 కేవీ సబ్‌స్టేషన్లు దెబ్బతిన్నా, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా యుద్ధప్రాతిపదికన స్పందించి పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలని సీఎస్ ఇంధన సంస్థలను ఆదేశించారు.

# భీమవరంలో శ్రీ వెంకట సాయి బాబా వారి చతుర్దశ (14వ) వార్షికోత్సవాలు

**- ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు**



**భీమవరం, మే 4 (జనస్వరం) :** పట్టణం హౌసింగ్ బోర్డ్ కాలనీ లో దివ్యశ్రీ మల్లినీడి సత్యనారాయణ మూర్తి స్మృత్యర్థం వారి కుమారుడు మల్లినీడి తిరుమలరావు (బాబీ) వారి కుటుంబ సభ్యులచే నిర్మించబడిన శ్రీ వెంకట సాయి బాబా వారి మందిరంలో జరుగుతున్న చతుర్దశ (14వ) వార్షికోత్సవాల సందర్భంగా నవగ్రహ పూర్వక శ్రీనివాస సహిత సద్గురు సాయి ఆరాధన చతుర్వేద మంత్ర పారాయణకు ముఖ్య అతిథిగా ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి రెడ్డి అప్పల నాయుడు హాజరయ్యారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, త్రయాహ్నిక దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ షిర్డీ సాయినాథుని దివ్య ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం జరిగిన భారీ అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.